

# భగవంతునికి లేఖ

ఒక మారుమూల గ్రామంలో ఓ తల్లి కొడుకులు నివసిస్తూ ఉండేవారు. ఆ పిల్లవాడు రెండేళ్ళ వయసులోనే తండ్రిని కోల్పోయాడు. దాంతో ఆ తల్లి ఆ పిల్లవాడిని పెంచి, చదివించడానికి తగిన సంపాదన కోసం అనేక విధాలుగా శ్రమపడేది. ఆ బాలుడు కూడా చాలా వినయ, విధేయతలు కలిగి, తల్లి అంటే ఎంతో ప్రేమ కలిగి ఉండేవాడు.

ఈ విధంగా పెరిగి పెద్దవాడైన ఆ బాలుడు 7వ తరగతికి వచ్చాడు. పరీక్షల కోసం కష్టపడి చదువుతున్నాడు. ఒకరోజు ఆ పిల్లవాడు తన తల్లిని " తన పరీక్షలకోసం  ఫీజ్ నిమిత్తం రూ.20/-చెల్లించవలసి వచ్చి, దానికి నాలుగు రోజుల గడువు మాత్రమే ఉన్నదని, ఎలాగైనా ఆ డబ్బు సమకూర్చు వలసినదిగా కోరాడు."

ఆ తల్లి దగ్గర ఎటువంటి ధనం లేదు. పైగా అది నెల ఆఖరి రోజులు.దాంతో ఆదుర్దా చెందిన ఆ తల్లి స్కూల్ హెడ్మాస్టర్ వద్దకు వెళ్లి తన అశక్తతను తెలియజేసి, పరీక్ష ఫీజు కట్టుటకు కొంత గడువు కోరింది. అయితే ఆ హెడ్మాస్టరు తాను ఏ విధంగా సహాపడలేనని , తన నిస్సహాయతను వ్యక్తం చేశాడు. దాంతో బాధతో వెనక్కి వచ్చిన ఆ తల్లి తన పూరిపాక వద్ద కూర్చుని దుఃఖించసాగింది. స్కూల్ నుండి ఇంటికి వచ్చిన కొడుకు తన తల్లి దుఃఖించడం చూసి "అమ్మా! నువ్వు ఎందుకు బాధ పడుతున్నావు అని అడిగాడు. దానికి ఆ తల్లి నాయనా నేను నేను ఎంత ప్రయత్నించిననూ నీ పరీక్ష రుసుమునకు ధనం చిక్కలేదు. నువ్వు రేపటినుండి స్కూలుకు వెళ్ళలేవు. కనుక నాతో బయట పనులకు రావడం తప్ప మనకు వేరే మార్గం లేదు అని చెప్పింది. దానికి ఆ పిల్లవాడు అమ్మా! నీవు ఎవరి వద్దనైనా 20 రూపాయలు అప్పుగా తీసుకుని రావచ్చు కదా. నేను పరీక్షల అనంతరం కష్టపడి పని చేసి ఆ అప్పు తీర్చివేస్తాను అని పలికాడు."

అయితే ఆ తల్లి నాయనా! మనకు అప్పు ఇచ్చే వాడు ఎవరు ? ఆ "పైవాడు" తప్ప మనకు ఎవరు సహాయం చేయలేరు అని వాపోయింది. అది విన్న కుర్రవాడు ఆ "పై వాడు" అంటే ఎవరు ? అమ్మా! అతన్ని ఏమని పిలుస్తారు? అతడు ఎక్కడ ఉంటాడు? అతని చిరునామా ఏమిటి? నేను అతడి వద్ద వెళ్ళి డబ్బు తీసుకుని వస్తాను, అని అమాయకంగా అడిగాడు..

దానికి ఆ తల్లి నిరాశా, నిస్పృహలతో నాయనా! అతడు వైకుంఠంలో ఉండే శ్రీమన్నారాయణుడు.

ఈ సకల సంపదలకు అతడే ఆధారం. ఆయన "భగవంతుడు" అని పలికింది.



తల్లి మాటలు విన్న ఆ పిల్లవాడు ఒక్క ఉదుటున అక్కడి నుండి పరిగెత్తి, తపాలా కార్యాలయానికి వెళ్ళాడు. అక్కడ తనవద్దనున్న కొద్దిపాటి చిల్లర నాణాలతో ఒక పోస్ట్ కార్డ్ ను కొని, దానిపై తన తల్లి యొక్క దురదృష్టకర పరిస్థితిని మరియు తన అవసరాన్ని వివరిస్తూ, వెంటనే తనకు తిరుగు టపాలో 20 రూపాయలు పంపవలసిందిగా భగవంతునికి ఉత్తరం రాశాడు. ఉత్తరం చిరునామాలో "శ్రీమన్నారాయణుడు గారు, వైకుంఠం" అని వ్రాశాడు. ఆ ఉత్తరాన్ని పక్కనే చెట్టుకు కట్టబడి యున్న పోస్ట్ బాక్స్ లో వేయడానికి ప్రయత్నించాడు.

ఆ బాక్స్ ఎత్తులో ఉన్నందువల్ల అందుకోలేక, ఉత్తరం పోస్ట్ బాక్స్ లో వేయలేక ఇబ్బంది పడ్డాడు. ఇదంతా గమనిస్తూ ఉన్న ఆ పోస్టు మాస్టారు ఆకార్డును బాక్స్ లో వేయుటకై ఆ పిల్లవాడికి సహాయం చేయదలచి బయటికి వచ్చి, ఆ కార్డుని చూచి "నాయనా ఈ ఉత్తరము నీవు ఎవరికి వ్రాశావు"ని అడిగెను.

అంత ఆ పిల్లవాడు " సార్, నేను దీనిని శ్రీమన్నారాయణునకు వ్రాశాను. నేను మూడు రోజుల్లోగా పరీక్ష ఫీజు చెల్లించవలెను కనుక నాకు 20 రూపాయలు పంపవలసింది, సమయం చాలా తక్కువ ఉన్నది, ఇది చాలా అత్యవసరం"అని తెలియజేశాను." అని అమాయకంగా బదులిచ్చెను.




ఆ ఉత్తరం చిరునామా చూసిన పోస్ట్ మాస్టారు ఆశ్చర్యంతో బాబూ! నీకు ఈ అడ్రస్ ఎవరిచ్చారు ? అని అడిగెను. అంతట ఆ బాలుడు తనకూ, తన తల్లికి జరిగిన సంభాషణ అంతా వివరిస్తూ, అయ్యా! మా అమ్మ చెప్పింది. భగవంతుడు ఎంతో దయగలవాడు. మనం ఆర్తితో ప్రార్థిస్తే మనకు తప్పక సహాయం చేస్తాడు అని. అందుకే నేను భగవంతుడికి ఉత్తరం వ్రాశాను. అని చెప్పాడు. అది విన్న పోస్ట్ మాస్టారికి నోట మాట రాక, కళ్ళ నిండా నీళ్ళు కారసాగాయి. అతను ఆ పిల్ల వాడి భుజం తడుతూ "బాబు నువ్వేం కంగారు పడకు, నేను ఈ ఉత్తరము ఆ భగవంతుడికి చాలా త్వరగా అందేలా స్పీడ్ పోస్ట్ చేస్తాను. నీవు మరల రేపు ఇక్కడికి రా! అని చెప్పి పంపాడు. దాంతో ఆ పిల్లవాడు ఆనందంగా ఇంటికి పరుగు పరుగున వెళ్ళాడు. తన తల్లితో తనకు ఒక్క రోజులో డబ్బు అదుతున్నదని చెప్పాడు.

తర్వాత రోజు ఆ పిల్లవాడు పోస్ట్ మాస్టారు దగ్గరికి వెళ్లాడు. అక్కడ ఆ పోస్ట్ మాస్టారు" బాబూ ఈ కవరులో 20 రూపాయలు ఉన్నాయి. ఇది తీసుకుని వెళ్లి నీ ఫీజు చెల్లించు. అంటూ ఓ పోస్టు ఎవరు ఆ పిల్లవాడి చేతికి అందించాడు. ఆనందంతో ఆకవరు పట్టుకెళ్ళి ఆ పిల్లవాడు తన తల్లికి ఆశ్చర్యపోయిన ఆ తల్లి విషయం అర్థం కాక తన కొడుకును ఆ 20 రూపాయలు ఎక్కడి నుంచి తెచ్చావు అని గద్దించి అడిగగా తనకు, ఆపోస్టుమాస్టర్ కు జరిగిన సంభాషణ అంతా వివరించెను. అయినను ఆ తల్లి నమ్మక, నేరుగా పోస్ట్మాస్టర్ వద్దకు వెళ్లి తన కొడుకు చెప్పినది ఇది నిజమా కాదా అని ప్రశ్నించెను.



అంతట ఆ పోస్ట్ మాస్టారు అమ్మా! ఇది అంతయూ నిజము. మీ పిల్లవాడిని నమ్మండి. మీ పిల్లవాడు రాసిన ఉత్తరం నన్ను కదిలించి వేసింది.ఇంతవరకూ ఎవరు కూడా ఆ భగవంతునికి జాబు రాయటం నేను చూడలేదు. ఆ ఉత్తరం నా కళ్ళలో నీళ్ళు తెప్పించింది.ఆ భగవంతుడే నన్ను ప్రేరేపించి,నీ కమారుడికి నా చేత సహాయం చేయించాడు. దయచేసి ఈ సొమ్మును స్వీకరించండి. ఆ భగవంతుడు నన్ను ప్రేరేపించకపోయినచో నా కళ్ళు మూసుకొని పోయివుండి, నీ కుమారుడికి ఈ విధమైన సహాయం చేసుకునే అవకాశం కలిగి వుండకపోవును. కనుక మీరు ఈ 20 రూపాయలు స్వీకరించండి. ఒక మంచి పిల్ల వాడికి సహాయం చేసే అవకాశాన్ని నాకు కలిగించండి, అని ఆ ఇరవై రూపాయలను ఇచ్చెను. కనుక మనం నిజాయితీగా, ఆర్తిగా భగవంతున్ని ప్రార్థిస్తే ఆయన మరొకరి ద్వారా తన సహాయాన్ని మనకు తప్పక అందజేస్తారు. పరిపూర్ణ భగవత్ విశ్వాసం మనల్ని అన్ని కష్టాలు నుండి బయటపడేస్తుంది. *కనుక పిల్లలూ మనం కూడా నిరంతరం మనల్ని కాపాడే ఆ భగవంతునికి మన ప్రార్థనలన్నీ ఒక ఉత్తరంలో రాసి అందిద్దాము*

**Samastha Loka Sukhino Bhavanthu**